కథ

# దిద్దుబాటు

సోమవఝల నాగేంద్రప్రసాదు

ఫణీంద్ర రైల్వే సర్వీసు పూర్తికానున్న ఉద్యోగి. అతని భార్య శాంతి. పేరుకి తగ్గట్టే ఎంతో శాంతంగా ఉంటూ తన పేరుని సార్ధకత చేసుకుంటోంది. అప్పుడప్పుడు భర్త అడగకపోయినా సలహాలిస్తూ సంసార నావ ఆటుపోట్లకి గురికాకుండా జాగ్రత్తపడుతూ కరణేషు మంత్రి అనిపించుకుంటూంది. వారికి ఇద్దరు పిల్లలు. అదృష్టమో, దురదృష్టమో ఇద్దరూ మగపిల్లలే. పెద్దవాడు శ్రీధర్ ఇంజనీరింగ్ చదివి, ఓ పేరున్న మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తూ పెళ్లాం పిల్లలతో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడు. రెండవ కొడుకు రాఘువ ఈ మధ్యనే ఇంటర్ మంచి మార్కులతో పాసయ్యాడు. అంతా సవ్యంగానే ఉంది కదా, ఇంక ఈ నస ఎందుకు అనుకుంటున్నారు కదూ, అదిగో అక్కడే తెలియకుండా కథలో కాలేసే సారు కాబట్టి లోతుని గూడా చూసి బయటికి రండి.

★★★

'ఐతే నీకు ఇంజనీరింగ్ చదవడం ఇష్టం లేదంటావ్' కొడుకు రాఘవని ఉపోద్ఘాతంగా అడిగాడు ఫణీంద్ర.

'అదే కదా చెబ్తున్నాడు' చెప్పింది శాంతి.

'నువ్వుండు, వాడిని చెప్పనీ' చిరుకోపంతో శాంతి మాటలకు అడ్డుపడ్డ ఫణీంద్ర, 'ఊ చెప్పరా నీకు ఇంజనీరింగ్ చదవడం ఎందుకు ఇష్టం లేదు?' కొంచెం గొంతుస్థాయిని పెంచి అడిగాడు.

తండ్రి కోపాన్ని అర్ధంచేసుకొన్న రాఘువ ఏం మాట్లాడకుండా అలాగే నించున్నాడు.

ఏం మాట్లాడకుండా మౌనంగా ఉన్న కొడుకుని చూడగానే సహనం చచ్చిపోయిన ఫణీంద్ర 'ఏంటిరా ఏం సమాధానం చెప్పకుండా అలా ముంగిలా ఊరుకుంటావే' ఈసారి కొంచెం కోపంగానే అన్నాడు.

'ఏంటండి, వాడేదో నేరమో, ఘోరమో చేసినట్లు అలా వాడిమీద కోప్పడతారెందుకు' అంతవరకు శాంతంగా ఉన్న శాంతి కొంచెం సీరియస్‌గా అనడంతో మెత్తబడ్డ ఫణీంద్ర 'సరేనే విషయం కనీసం నీకైనా చెప్పమను, కన్నతల్లివి కదా' వ్యంగ్యంగా రాఘువ వంక చూస్తూ అన్నాడు.

అమ్మ మాటలతో ధైర్యం తెచ్చుకొన్న రాఘువ మొదటిసారిగా తండ్రి ముందు నోరువిప్పి 'సారీ నాన్నగారు, నాకు ఇంజనీరింగ్ చదవడం ఇష్టంలేదు' ధైర్యాన్ని కూడగట్టుకొని మెల్లగా చెప్పాడు.

'అదే ఎందుకిష్టం లేదు అనే అడుగుతున్నాను' తిరిగి అన్నాడు ఫణీంద్ర.


'నాకు ఫైన్ ఆర్ట్స్ అంటే ఇష్టం నాన్నగారు. నేను ఫైన్ ఆర్ట్స్ లోనే జాయినవుతాను' చెప్పాడు రాఘువ.

'ఎందుకూ పనికిరాని ఫైన్ ఆర్ట్సా! కూడు పెట్టేనా? గుడ్డ పెట్టేనా? పిచ్చి వెధవలా బొమ్మలు గీసుకుంటూ కాలం గడపాలి తెలుసా?' వ్యంగ్యంగా అన్నాడు.

'అలా అనకండి నాన్నగారు! దయచేసి ఏ విద్యనీ అంత చులకనగా తీసిపారెయ్యకండి. ఫైన్ ఆర్ట్స్ చేసి పైకొచ్చిన వాళ్ళు ఎంతో మంది ఉన్నారు' అంటూ మనసులోని మాటని ధైర్యంగా చెప్పాడు రాఘువ.

'అలా పైకొచ్చిన వాళ్ళు కొద్దిమందే ఉన్నారు. చెప్పాలంటే వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. కాని నేను కోరుకున్నట్లు నువ్వు కూడా మీ అన్నలాగే ఇంజనీరింగ్ చదివేవనుకో, ఎక్కడో అక్కడ ఏదో ఒక ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు' రాఘువ మనసు మార్చేందుకు మరో ప్రయత్నం చేస్తూ అన్నాడు ఫణీంద్ర.

'ఏమో నాన్నగారు, నాకు ఫైన్ ఆర్ట్స్ లోనే జేరాలని ఉంది' అదే తన చివరి నిర్ణయంగా




చెప్పాడు రాఘవ.

'ఒరేయ్ రాఘవా..! నువ్వింకా చిన్నపిల్లాడివిరా! ఏది మంచో ఏది చెడో నీకు తెలియదు. చెపితే అర్థం చేసుకోవు. మీ అన్నయ్యని చూడు ముందు వాడుకూడా నీలాగే ఇంజనీరింగ్ చదవను, నాకు కామర్స్ అంటే ఇష్టం అన్నాడు. కాని నా మాటవిని ఇంజనీరింగ్ పూర్తిచేసి హాయిగా, దర్జాగా బ్రతుకుతున్నాడు' నచ్చచెప్పబోయాడు ఫణీంద్ర.

'అన్నయ్య ఆనందంగా ఉన్నాడని మీరనుకుంటున్నారు. కాని వాడు మీరనుకొన్నట్లు ఆనందంగా లేడు నాన్న!' అతనికి అంతవరకు తెలియని విషయాన్ని చెప్పాడు రాఘవ.

'అంటే' అర్థం కానట్లు అడిగాడు ఫణీంద్ర.



'ఏం లేదు నాన్నగారు. మీ పోరు పడలేక అన్నయ్య ఇంజనీరింగ్ చేసాడు కాని, ఆ సబ్జెక్టు మీద ఇంటరెస్టుతో కాదు. ఇంకో విషయం నాన్నగారు, త్వరలో వాడు ప్రైవేటుగా ఎంబియే పూర్తి చేయబోతున్నాడు. అది పూర్తైతే ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి కొత్త ఉద్యోగంలో జాయినవాలనుకొంటున్నాడు' షాకింగ్ న్యూస్ చెప్పాడు రాఘవ.

'అంటే నాకు తెలియకుండా ఇంట్లో చాలా విషయాలు జరుగుతున్నాయన్నమాట' శాంతి వంక చూస్తూ అన్నాడు ఫణీంద్ర.

'అంటే ఏంటి మీ ఉద్దేశ్యం. ఐనా వాడు క్వాలిఫికేషన్ పెంచుకోవాలనుకొన్నాడు, తప్పా? వాడికి ఇష్టంలేని ఉద్యోగాన్ని కాదని కొత్త ఉద్యోగంలో చేరాలనుకొంటున్నాడు. అందులో తప్పేంటో నాకు అర్థంకాలేదు. వాళ్ళు ఈ కాలం పిల్లలండి. మీలాగే ఒకే ఉద్యోగాన్ని పట్టుకొని కూర్చోరు. ఎక్కడ వాళ్లకు బావుంటుంది అనిపిస్తే అక్కడకి మారతారు. మీరు మీ స్థానంలో కాకుండా వాళ్ళ స్థానంలో ఉండి ఆలోచించండి. అప్పుడు వాళ్ళ అలవాట్లు, అభిరుచులు, జీవన విధానం పట్ల వాళ్ళ ఆలోచనలు ఏమిటో తెలుస్తాయి. అవన్నీ తెలుసుకోకుండా దయచేసి బలవంతంగా మీ అభిప్రాయలను వాళ్ళ మీద రుద్దకండి' చిన్న క్లాసు తీసుకొంది శాంతి.

'అంటే ఏమాత్రం స్థిరత్వం అన్నది లేకుండా, గాలివాటు తనంగా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడికి కావాలంటే అక్కడికి 'కప్పల్లా' గెంతుతూ ఉంటారన్నమాట' కప్పల్లా అన్న మాటని వత్తిపలుకుతూ వ్యంగ్యంగా అన్నాడు.

'మీరు ఏమైనా అనండి. ఇది ఈనాటి పిల్లలకు అతిసహజం' ఎంతో కామ్‌గా చెప్పింది శాంతి.

'సరే మీరు అందరు ఒక పక్షమై, నన్ను వేరుగా చూస్తున్నప్పుడు ఇంక మాట్లాడడానికేముంది. నా అభిప్రాయానికి విలువలేనప్పుడు నేను మాట్లాడి మాత్రం ఏం ప్రయోజనం. ముందుముందు వాడి భవిష్యత్తు బాగుంటుందనే ఉద్దేశ్యంతో వాడిని అలా చేయమన్నానేగాని, వాడిని బలవంతంగా ఇష్టంలేని చదువుని చదివించాలనికాదు. వాడికి కావాల్సిన చదువునే చదవమను. ఇందులో ఎవరి బలవంతం ఏమీలేదు. వాడినంటే కన్నాను కాని వాడి అదృష్టాన్ని, తలరాతనీ కనలేదుగా. వాడి నుదిటిరాద ఎలా ఉంటే అలా జరుగుతుంది' అంటూ అక్కడనుండి ఆఫీసుకి వెళ్లిపోయాడు ఫణీంద్ర.

***

'సార్, ఈ నోటీసు మీద సంతకం పెట్టండి' అంటూ చేతిలో నోటీసుతో తన దగ్గరికి వచ్చిన ప్యూన్ అప్పారావుతో 'ఏంటి అప్పారావూ! ఏదైనా విశేషమా' నోటీసు చేతిలోకి తీసుకుంటూ అడిగాడు ఫణీంద్ర.

'నోటీసు చదవండి సారూ, మీకే తెలుస్తుంది' బాధగా మొహం పెడ్తూ అన్నాడు అప్పారావు.

నోటీసు చదివిన ఫణీంద్ర, విషయం నిజమేనా అన్నట్లుగా అప్పారావు వంక చూసాడు.

'నిజమే సారూ, మన రామారావుగారి అబ్బాయి ఆత్మహత్య చేసుకొన్నాడు' మెల్లగా చెప్పి మిగతావారికి కూడా నోటీసు చూపించడానికి అక్కడనుండి కదిలాడు అప్పారావు.

ఫణీంద్రకి కొలీగు రామారావు కొడుకు మరణవార్త మింగుడుపడకుండా ఉంది. చక్కగా కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడని ఎంతో ఆనందపడుతూ చెప్పే రామారావు మొహమే మాటిమాటికి అతనికి గుర్తుకు వస్తోంది.

అసలేం జరిగిందో తెలుసుకోవాలని ఆఫీసులో కండోలెన్స్ అయిన తరువాత రామారావు ఇంటికి వెళ్ళాడు.

***

'రా.. ఫణీంద్రా... రా... అంతా

కలలోలాగా జరిగిపోయిందయ్యా! వాడిమీదే ఎన్నో ఆశలు పెట్టుకొన్నాను. నా ఆశలన్నీ అడియాసలు చేస్తూ, మమ్మల్ని ఇలా ఒంటరివాళ్ళని చేసి వాడు వెళ్ళిపోయాడయ్యా' చేతిలోని రుమాలుతో మొహాన్ని దాచుకుంటూ బోరుమన్నాడు రామారావు.

అతని పరిస్థితి చూసి జాలిపడ్డ ఫణీంద్ర 'ఏంటి సార్, ఇదంతా ఎలా జరిగింది?

'ఏం చెప్పమంటావయ్యా, అంతా మా ఖర్మ' కంట్లోని నీటిని తుడుచుకుంటూ అన్నాడు రామారావు.

'అసలు మీవాడికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది' కారణం తెలుసుకోవాలన్న తపనతో అడిగాడు ఫణీంద్ర.

'ఏం చెప్పను ఫణీంద్రా! ఈనాటి పిల్లలు చాలా ఫాస్టయ్యా! అలాగే నిర్ణయాలు కూడా అంత ఫాస్టుగాను తీసుకుంటారు. మావాడుకూడా ఏదో ఆవేశంలో చాలా తొందరపాటు నిర్ణయం తీసుకున్నాడయ్యా' చెప్పడం ఆపాడు రామారావు.



'ఆత్మహత్య చేసుకునేంత పెద్దనిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' రామారావు భుజంమీద చెయ్యివేస్తూ ఓదార్పుగా అన్నాడు ఫణీంద్ర.

'ఏం చెప్పమంటావయ్యా, వాడు వరుసగా రెండు సెమిస్టర్లలో తప్పాడట. అదే విషయాన్ని పేరెంట్సుకు తెలియజేస్తామని కాలేజీ ప్రిన్సిపాలు పిలిచి వార్నింగిచ్చేడుట. వాడు తప్పిన విషయం ఇంట్లో మాకు తెలిస్తే, ఎక్కడ వాడిమీద కోప్పడతామేమోననే భయంతో ఇదిగో ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడ్డాడు' చెప్పాడు రామారావు.

'అదేంటిసార్, మీవాడు బాగానే చదువుతాడు కదా, మరి అటువంటప్పుడు...' ఇంకా ఏదో అనబోతున్న ఫణీంద్రతో 'నిజమేనయ్యా వాడు బాగానే చదువుతాడు. కాని నేను చేసిన చిన్న తప్పువల్ల, ఇదిగో ఈనాడు ఆ బాధని, కడుపుకోతని అనుభవిస్తున్నాను' చెప్పడం ఆపాడు రామారావు.

ఫణీంద్రకి అంతా అయోమయంగా ఉంది. మీ నిర్ణయానికి అతని ఆత్మహత్యకి సంబంధమేమిటి అన్నట్లుగా అతని వంక అర్థం కానట్లుగా చూసాడు.

రామారావు మరలా చెప్పడం ప్రారంభించాడు...

'వాడికి అసలు ఇంజనీరింగ్ చదవడం ఇష్టం లేదయ్యా. కామర్సు చదివి, సి.ఏ చెయ్యాలని వాడి ఆశ. కాని నేనే వాడి అభిప్రాయానికి విలువివ్వకుండా, బలవంతంగా వాడిని ఇంజనీరింగ్ కోర్సులో జాయినుచేసి పరోక్షంగా వాడి చావుకి కారణమయ్యాను. వాడుకూడా ఏనాడు నా నిర్ణయానికి అడ్డుచెప్పలేదు. బహుశా అలాచేస్తే నేను బాధపడతానేమోనని అనుకొన్నాడేమో. నేనే వాణ్ణి సరిగ్గా అర్థంచేసుకుని, వాడి చదువు వాడి ఇష్టానికే వదిలేసి ఉంటే, మాకు ఈనాడు ఈ దుస్థితి వచ్చేది కాదేమో' వెక్కుతూ అన్నాడు రామారావు.

విషయం విన్న ఫణీంద్ర ఆశ్చర్యపోతూ, ఉదయం తనకు, కొడుకు రాఘవకి జరిగిన సంభాషణ గురించి రామారావుకి చెప్పాడు.

'చూడు ఫణీంద్రా..! ఒక ఆప్త మిత్రుడిగా ఒక చిన్న సలహా. మీవాడి చదువు విషయం అతని నిర్ణయానికే వదిలేయ్. బలవంతంగా నీ అభిప్రాయాలని వాడిమీద రుద్దాలని చూడకు. ఈనాటి కుర్రవాళ్ళు మనమనుకున్నంత అమాయకులు కాదయ్యా. ఏది మంచో ఏది చెడో వాళ్ళకి బాగా తెలుసు. మనమే అనవసరంగా వాళ్ళ అభిప్రాయాలను గౌరవించకుండా, మన అభిప్రాయాలను, ఇష్టాలను వాళ్ళమీద బలవంతంగా రుద్దుతూ వాళ్ళకిష్టంలేని చదువులకే పంపిస్తున్నాము. మీవాడు చెప్పినట్లు ఈనాడు అన్ని ప్రొఫెషనల్ కోర్సులకు మంచి స్కోప్ ఉందయ్యా. మనమే వాళ్ళని అర్థంచేసుకోకుండా, మనం చెప్పినట్లే వినాలనే అహంభావంతో వాళ్ళకి వాళ్ళ అభిప్రాయాలు మనతో పంచుకొనే అవకాశాన్ని ఇవ్వడం లేదు. తల్లితండ్రుల మీదుండే గౌరవంతోనో, భక్తితోనో, భయంతోనో నోరు విప్పి వాళ్ళ మనసులోని మాట చెప్పలేక, వాళ్ళకి నచ్చని చదువుని చదవలేక వాళ్ళలో వాళ్ళే కుమిలిపోతూ ఇదిగో ఇలా మధ్యాంతరంగా జీవితాలను ముగిస్తున్నారు. కాబట్టి తరాల అంతరాలని మనలాంటి పెద్దవాళ్లు గుర్తించి, పిల్లల ఆలోచనలను మన్నిస్తే వాళ్ళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా పిల్లలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకొనేందుకు మనం పెద్దమనసుతో సహకరించిన నాడు వాళ్ళు మనల్ని, మన అభిప్రాయాల్ని అర్థంచేసుకొని మరింత బాధ్యతగా మసలుకుంటారు. అందుచేత నువ్వు పొరపాటున గూడా మీకుర్రాడి విషయంలో నేను చేసిన తప్పునే చెయ్యకు' అంటూ చనువుగా హితబోధ చేసాడు రామారావు.

'తప్పకుండా సార్. మీవాడి నిర్వాకాన్ని కళ్ళారా చూసిన తరువాత కూడా అటువంటి తప్పుడు నిర్ణయాన్ని ఎందుకు తీసుకుంటాను. వాడు చదువుతానన్న కోర్సునే చదివిస్తాను' అంటూ అతని దగ్గర శలవు తీసుకున్న ఫణీంద్ర కొడుకు చదువు విషయంలో తన తప్పుని 'దిద్దుబాటు' చేసుకోవాలనే ఆలోచనతో ఇంటిదారి పట్టాడు.

★


చిరునామా:
ఎస్.నాగేంద్రప్రసాద్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయోలజీ,
ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్,
బనారస్ హిందూ యూనివర్సిటీ,
వారణాసి – 221 005.


## జీన్స్ కూడా వేసుకోను...

ఈ మాట సాదాసీదా ఆడపిల్ల అంటే పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. కానీ ఈ మాట అన్నది మరెవరో కాదు, తన అందచందాలతో, రకరకాల మోడ్రన్ డ్రస్సులతో బాలీవుడ్‌ను ఓ ఊపు ఊపుతున్న ప్రియాంక చోప్రా. 'దోస్తానా'లో ఆమె కాస్ట్యూమ్స్ చూసిన వారు ఆమె ఈ మాట అన్నది అంటే నమ్మకపోవచ్చు. కాని ఇది నిజం. అయితే అది సినిమాలకు వర్తించదట! సినిమాలో నేను ఎన్ని 'వేషాలు' వేసినా ఇంటి దగ్గర మాత్రం బుద్ధిగా ఉంటాను అంటోంది. 'మా మదర్‌కి తను జీన్స్ వేసినా నచ్చదు. ఇక మోడ్రన్ డ్రస్‌ల గురించి చెప్పనక్కర్లేదు. ఇంట్లో సంప్రదాయబద్ధంగా చుడీదార్లు మాత్రమే వేసుకుంటాను. నా కోసం మా అమ్మ ప్రత్యేకించి 12 చుడీదార్లను ఎంపిక చేసింది. ఇంట్లో వాటినే వేసుకుంటాను. అలాగే ఫ్యామిలీ ఫంక్షన్లకు వెళ్లినప్పుడు కూడా అమ్మే నా డ్రస్ సెలక్షన్ చేస్తుంది. అంతా సంప్రదాయబద్ధంగానే జరగాలన్నది అమ్మ రూల్. దీన్ని అందరం తూచ తప్పక పాటిస్తాం. ఏది ఏమైనా నేను బాలీవుడ్ మోస్ట్ గ్లామరస్ గర్ల్‌ని అన్నది అమ్మ సైతం అంగీకరించే నిజం' అంటోంది ప్రియాంక. ఈ ద్వంద్వ వైఖరి ఏమిటో అర్థం కాక తలలు పట్టుకునే వాళ్లు కూడా ఉన్నారనుకోండి. అది వేరే సంగతి!